# అమ్మా!... మన్నించవూ!

**"స**రితా, కేశవకి గుర్తుచెయ్యి. ఈ నెలలో ఏదో డబ్బు అందుతుందని అన్నాడుగా, నరసమ్మకి ఇచ్చేస్తే సరి. అనవసరంగా మనకీ వడ్డీ పెరుగుతోందిగా!" అన్నపూర్ణమ్మ అంది.

క్రితం రోజు రెండు వేలు పెట్టి కొన్న పట్టుచీరెను పక్కింటావిడకి పెరటిగోడ మీదుగా చూపించి వస్తూ అత్తగారి మాటలకు మొహం చిట్లించుకుంది. గదిలోకి వెళ్ళి చీరె పాకెట్టును విసురుగా టేబుల్‌పై పడేసి, ఆఫీసుకి వెళ్ళటానికి తయారవుతున్న భర్త కేశవరావుకీ, గుమ్మం దగ్గిర నిలబడ్డ అత్తగారికీ వినిపించేట్లుగా గట్టిగానే అంది.

"వడ్డీలివ్వటం మావల్లకాదు. కావాలని అడగొచ్చుగా? నరసమ్మకివ్వాలని అదొక అబద్ధం ఎందుకో! కొడుకు దగ్గిర కూడా వ్యాపారమే!"

ఆ నిందారోపణకి అన్నపూర్ణమ్మ ఒక క్షణం నిర్ఘాంతపోయింది!

కొడుకు ఏమంటాడా అని ఎదురుచూసింది. ఏం అంటాడు?

"తీసుకున్నది నేను. ఎలా ఇవ్వాలో నాకు తెలుసులే. మధ్యలో నువ్వెందుకూ అనవసరంగా హైరానా పడతావ్?" అని అంటాడా... లేక –

"మా అమ్మకే అయితే ఇంకేం, వడ్డీతో ఇవ్వటానికి కష్టమెందుకూ, ఆనందంగా ఇస్తానుగానీ" అని అంటాడా...!

రెండు నిముషాలు గడిచాయి. కేశవరావు ఏం మాట్లాడలేదు. బ్రీఫ్‌కేసు చేత బట్టుకుని వెళ్ళిపోయాడు. అన్నపూర్ణమ్మ చూస్తూ నిలబడిపోయింది.

ఆ మౌనానికి అర్థం ఏమిటి?

కోడలు మాటలు నిజమేనని తనూ నమ్ముతున్నాడా?

తన సర్వ ప్రపంచమూ ఒక్కసారిగా శూన్యమైపోయి చీకటిలో నిలబడిపోయినట్లుగా వుంది అన్నపూర్ణమ్మకు. ఒంట్లోని శక్తి అంతా హరించుకుపోయినట్లుగా నీరసం ముంచుకు వచ్చింది. మెల్లగా గదిలోకి వెళ్ళి గోడవేపుకు తిరిగి పడుకుంది.

చెక్కిళ్ళ మీదుగా కన్నీళ్ళు ధారకట్టాయ్!

జీవితంలో ఎన్నో కష్టనష్టాలను చిరునవ్వుతో ధైర్యంగా ఎదుర్కోగలిగిన తను ఈ చిన్న కారణానికి కన్నీళ్ళు కార్చటమా...?! ఛ! ఛ! కూడదు!

ప్రవాహాన్ని వెనక్కి మళ్ళించటం సాధ్యంకానట్లే, ఉబికి ఉబికి వచ్చే కన్నీళ్ళను ఆపటమూ అసాధ్యమే! కారణం చిన్నదే అయినా అది బాణంలా గుండెలో చేసిన గాయం పెద్దదే మరి!

నాలుగు సంవత్సరాల క్రితం చాకలి నరసమ్మ నాలుగువేల రూపాయలు తెచ్చి అన్నపూర్ణమ్మ చేతికిచ్చింది. రెండేళ్ళనుండి కడుతున్న చీటీ డబ్బు అందిందనీ, ఇంటికి తీసుకువెళ్తే కొడుకూ కోడలూ ఏదోదానికి కావాలని చెప్పి తీసేసుకుంటారనే భయంతో అన్నపూర్ణమ్మను దాచమంది.

పిల్లకి పెళ్ళి చేసి బాధ్యత తీరిపోయాక ఆ డబ్బుతో యాత్రలకు వెళ్ళాలనే కోరికుంది నరసమ్మకు. ఎవరికైనా వడ్డీకివ్వటమో, బ్యాంకులో వేయటమో ఆలోచించి చేయొచ్చని ప్రస్తుతానికి అన్నపూర్ణమ్మను దాచమంది.

ఆ మరునాడు కేశవరావు తన ఆఫీసులోని వాళ్ళు కొంతమంది ఇళ్ళ స్థలాలు తీసుకుంటున్నారనీ, తన దగ్గరున్న డబ్బుకి కొంత అప్పుచేసి తనూ ఓ ప్లాటు తీసుకోవాలని అనుకుంటున్నాననీ మాటల సందర్భంలో తల్లికి చెప్పాడు.

అన్నపూర్ణమ్మ తన దగ్గిరున్న నరసమ్మ డబ్బు సంగతి చెప్పింది. "అయితే మనమే వడ్డీతో ఇద్దాం" అని చెప్పి కేశవరావు ఆ డబ్బు తీసుకున్నాడు.

అన్నపూర్ణమ్మ నరసమ్మకా విషయం చెప్పింది. "మీ దగ్గిరుంటే ఇంకేమండీ, నాకు ఇనప్పెట్టెలో వున్నట్లే నిశ్చింత" అంటూ నరసమ్మా సంతోషించింది.

నాలుగేళ్ళు గడిచాయి. మధ్యలో ఒకసారి అన్నపూర్ణమ్మ కొడుకుకి గుర్తుచేసింది. ఫ్రిజ్ అనీ, స్కూటరనీ ఏదో ఒకటి కొంటూ వుండటంతో అతని చేతిలోనూ డబ్బు వుండటంలేదు. "తక్కువ వడ్డీయేగా ఫర్వాలేదు. ఇద్దాంలే" అన్నాడు. నరసమ్మకి అవసరం రాక అడగలేదు.

మొన్నీ మధ్య నరసమ్మ కూతురికి పెళ్ళిఅయింది. అందుకని ఎప్పుడు కావాలంటుందో, ఉన్నప్పుడు ఇచ్చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో కొడుకుకి గుర్తుచేయమని కోడలుతో అన్నపూర్ణమ్మ యాధాలాపంగా అంది.

అది అత్తగారు దాచుకున్న డబ్బేననీ, ఎవరిదో అని చెప్పి తమకు వడ్డీకిచ్చిందనీ సరిత ఉద్దేశం. హైస్కూలుతోనే ఆసక్తిలేక చదువు ఆపేసినా, పెళ్ళయ్యే వరకూ ఇంట్లోనే వున్న నాలుగేళ్ళలో కుటుంబపరమైన విషయాల్లో సరిత చాలా విజ్ఞానాన్నే సంపాదించింది.

అత్తాకోడళ్ళ తగువులు, భార్యాభర్తల గొడవలూ... ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బుదాచుకునే పద్ధతులూ... అన్నీ ఆకళింపు చేసుకుని కొన్ని స్థిరమైన అభిప్రాయాలను ఏర్పరుచుకుంది.

డబ్బు ఇచ్చి ఎవరైనా అన్నేళ్ళువూరుకుంటారా! అందుకే సరిత కేశవరావు దగ్గిర కూడా అది అత్తగారి డబ్బేననీ, కొడుకుకి తెలియకుండా ఇంటి ఖర్చుల్లో మిగిల్చి దాచుకున్నదేనని ఒకటి రెండుసార్లు అంది. 'ఏమయితేనేంలే' అని వూరుకున్నాడు కేశవరావు.

ఆ రోజు ఎటువంటి సంకోచం లేకుండా మనసులోని మాటను పైకే అనేసింది. అత్తగారు ఏమీ అనకుండా మౌనంగా వూరుకునేసరికి 'దొంగకు తేలు కుట్టినట్లు నోరు మూసుకుంది' మనసులో అనుకుని సరిత సంతృప్తి పడింది.

అన్నపూర్ణమ్మ రెండు రోజులు ఒకటే ఆలోచనతో గడిపింది. మూడో రోజు పొరుగూరిలో వున్న కూతురు దగ్గరకు వెళ్ళొస్తానని వెళ్ళి సాయంకాలానికి తిరిగి వచ్చేసింది. ఆ మర్నాడు అత్తగారి చేతిని మెరుస్తోన్న గాజులను పట్టుకుని చూసి "ఇవేమిటీ, గోల్డ్ కవరింగ్ గాజుల్లా వున్నాయ్! కొన్నారా?" అంది ఆరాగా. అన్నపూర్ణమ్మ తల వూపి వూరుకుంది.

తర్వాత "మా అత్తగారు చేతికున్న బంగారపు గాజులు నాలుగూ కూతురికిచ్చి వచ్చింది. ఇస్తే ఎవరు కాదంటారూ? అంతా రహస్యమే, ఇచ్చానని అయినా చెప్పలేదు" అని సరిత అందని పక్కింటావిడ అన్నపూర్ణమ్మకి చెప్పింది. నిర్లిప్తంగా నవ్వి వూరుకుంది.

అన్నపూర్ణమ్మ  కేశవరావుతో సంప్రదించి మామగారింటిలో తమ వాటాగా వచ్చిన భాగాన్ని మరిదికి ఇవ్వటానికి అంగీకారమేనని కబురు పెట్టింది.

పెరడు ఎక్కువే వున్నా ఆ రెండు గదుల వాటా తమకి సరిపోదని వేరేవచ్చి వుంటున్నారు. కాబట్టి, కావాలని అడుగుతున్న చిన్నాన్నకి ఇచ్చేస్తేనే బావుంటుందని కేశవరావు అభిప్రాయపడ్డా, అన్నపూర్ణమ్మ అంగీకరించలేదు.

ఇప్పుడు ఇచ్చేయటానికి నిశ్చయించుకుని కబురు పెట్టగానే డబ్బు సర్దుబాటు చేసుకుని అన్నపూర్ణమ్మ మరిది రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.

ఆ నలభై వేల రూపాయల్నీ నెల నెలా వడ్డీ తీసేసుకునేట్లుగా బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్టు చేయించింది. మొదటి నెల వడ్డీ నాలుగు వందల రూపాయలూ తెచ్చి కేశవరావు ఇచ్చిన మర్నాడే అన్నపూర్ణమ్మ తన గదిలో తను వేరే పండుకుంటానని చెప్పింది.

కేశవరావు మొదట ఆశ్చర్యపోయాడు! "హాయిగా, విశ్రాంతిగా వుండాల్సిన ఈ వయసులో వేరే వంటా గింటా ఏమిటీ?" అంటూ కోపగించుకున్నాడు. కానీ సరిత అత్తగారి కోరిక తీర్చే భారాన్ని తన భుజాలపై ఆనందంగా వేసుకుంది.

కాపరానికి వచ్చిన కొత్తలోనే వేరే వుండాలన్న కోరికను భర్తకు చెప్పింది. "ఎంతమంది వున్నారనీ వేరే కాపరం?" అంటూ అతడు వినిపించుకోలేదు. తన భర్తా, పిల్లలూ... అదీ తన కుటుంబం! ఆపైన ఒక్క మనిషయినా అడ్డం... అడ్డమే, భారం... భారమే! అది సరిత ఉద్దేశం.

అందుకే భర్త అంగీకరించకపోయినా అత్తగారి నోటి వెంటే ఆ మాట రప్పించాలని అనుకునేది. లాభంలేదని ఆశ వదిలేసుకున్నాక, పదేళ్ళకయినా తనకోరిక తీరుతున్నందుకు సరితకు ఆనందంగా వుంది.

రోజూ ఏదో ఒక సందర్భంలో, డబ్బు అందగానే వేరే వుంటానని అత్తగారు అడగటంలోని అంతరార్థాన్ని రకరకాల వ్యాఖ్యానాలతో కేశవరావుకి చెప్పి చెప్పి "మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" అని సరిత అనిపించగలిగింది!

ఇక ఆ తర్వాత ఆలశ్యం చేయకుండా ఏర్పాటు చేసేసింది. అత్తగారి గిన్నెల్లోవే కొన్నింటిని త్యాగంచేసి ఆవిడ గదిలో పెట్టింది. ఏవైనా పెట్టుకోవటానికి పనికి వస్తుందంటూ ఓ చెక్క బీరువాని గుమ్మానికి అడ్డంగా పెట్టింది. ఇంట్లోంచి కాకుండా పెరటి గుమ్మం ద్వారా మాత్రమే మసలాలని కోడలు హద్దు గీసిందని అన్నపూర్ణమ్మ గ్రహించింది.

అన్నపూర్ణమ్మ తన అత్తగారి దగ్గర తన మనసుకు కష్టం కలిగించిన సంఘటనలన్నింటినీ డైరీలో రాసుకుంటున్నట్లుగా మనసులో పదిలపరుచుకునేది. అలాంటి పరిస్థితులు తన కోడలికి రానివ్వకూడదనీ, అన్ని విషయాల్లోనూ స్వతంత్రం ఇవ్వాలనీ గట్టిగా నిర్ణయాలు చేసుకునేది. కానీ అప్పుడామెకు తెలియదు కోడలుకు తను స్వతంత్రం ఇవ్వాల్సిన అవసరం వుండదనీ, కోడలి రాజ్యంలో తనే అస్వతంత్రురాలవుతుందనీ!

కోడలి నోటి దురుసుతో, అహంకార పూరిత ప్రవర్తనతో తన మనసుకు ఎంత కష్టం కలిగినా అన్నపూర్ణమ్మ కొడుకు మనశ్శాంతిని దృష్టిలో పెట్టుకుని సహించింది. భగవద్భక్తిలో ఓదార్పును పొందుతూ కాలం గడుపుతోంది. ఇక చివరకు వేరే వుండాలన్న నిర్ణయానికి వచ్చేసింది. గుండెలోని గాయం సలుపుతూనే వున్నా, శారీరకంగా ఇప్పుడే ఆవిడకు విశ్రాంతిగా అనిపించింది.

అన్నపూర్ణమ్మ సంపన్నులైన వ్యవసాయదారుల ఇంట పుట్టి గారాబంగా పెరిగింది. కలిగిన ఇంటికే కోడలుగా వచ్చినా అంతా పంచుకునే సరికి వచ్చింది తక్కువే. ఆపైన భర్త రాజేశ్వర్రావు స్వంతంగా వ్యవసాయం చేయకుండా కౌలుకిచ్చేసేవాడు.

అతనికి నాటకాలంటే పిచ్చివుంది. నాటక సమాజం వెంట, ఊరి గొడవల్తోనూ ఎక్కువగా తిరుగుతూండేవాడు. కౌలుకి వచ్చిన డబ్బునీ, కుటుంబ బాధ్యతనీ అన్నపూర్ణమ్మకే అప్పగించేసి, తనకు కావాలిసినది తీసుకుంటూ నిశ్చితంగా కాలక్షేపం చేసేవాడు.

అన్నపూర్ణమ్మకు పుట్టింటివాళ్ళు రెండెకరాల భూమి ఇస్తామని పెళ్ళిలో చెప్పారు. ఒక పొరుగూరి ఆసామీ అన్నపూర్ణమ్మ తండ్రికి తనివ్వవలిసిన బాకీకిగాను ఓ అయిదెకరాల మెట్ట భూమిని స్వాధీనపర్చాడు. అందులో రెండెకరాలు అన్నపూర్ణమ్మకి ఇస్తామని అంటే అత్తగారు "నీటి వసతిలేని చోట అక్కడ వ్యవసాయం ఎవరు చేస్తారూ, అమ్మి డబ్బులు ఇవ్వండి" అంది.

అప్పుడే ఒక ఎకరం ఆరువేలకి అమ్మి డబ్బు ఇచ్చేశారు. మిగతా ఎకరాన్నీ తర్వాత వాళ్ళనే అమ్ముకోమని ఇంకో ఆరువేలు కూడా ఇచ్చెయ్యమని అన్నపూర్ణమ్మ అత్తగారు అడిగింది కానీ వాళ్ళివ్వలేదు. బేరమయ్యాక ఇస్తామన్నారు. కాలక్రమేణా ఆ విషయం మరుగున పడిపోయింది. అన్నపూర్ణమ్మ అత్తగారు, మామగారు, తల్లీ, తండ్రీ వరసగా కాలగర్భంలో కలిసిపోయారు.

పిల్లల చదువుతో ఇంట్లో ఖర్చులు పెరుగుతూంటే అన్నపూర్ణమ్మ తన బంగారం కొంత కొంతగా అమ్మేయటం మొదలుపెట్టింది. ఇంట్లో గేదెను పెట్టుకుని, కూరగాయలను పండిస్తూ, తన అవసరాలు ఖర్చులూ లేకుండా ఎంతశ్రమపడినా ఆదాయం సరిపోయేదికాదు. పిల్లలకి ఏ లోటూరాకుండా అన్నీ సక్రమంగా జరగాలని ఆవిడ ఆరాటపడేది.

అన్నపూర్ణమ్మ తల్లి బ్రతికున్న రోజుల్లో ఒకసారి అన్నపూర్ణమ్మతో బాధగా అంది "పూర్ణా నీ డబ్బు ఆ అరువేలుతో ఇక్కడ కొన్న ఎకరం భూమినీ నీ పేర పెట్టించుకోలేదు, నలుగురిలోకి వెళ్ళినప్పుడు

నిండుగా వేసుకోవటానికి లేకుండా నగలన్నీ అమ్మేస్తున్నావు! పెద్దతనంలో నీకు ఆసరాగా వుండటానికి ఏమీ మిగుల్చుకోవటంలేదు!"

అన్నపూర్ణమ్మ నవ్వేసింది. "నా పేర వేరే ఆస్తి అక్కర్లేదమ్మా. నాకు ఆస్తి లేదని నువ్వు బాధపడ్తున్నావుగానీ నా అదృష్టం సంగతి నీకు సరిగా తెలియదు. తల్లిదండ్రులు పిల్లలు గురించి తాపత్రయం పడటం సహజమే. కానీ తల్లీ తండ్రి గురించి ఆరాటపడే పిల్లలు అరుదుగా వుంటారు. కేశవ నేను ఒక్కపూట భోజనం మానేసినా, తనూ తినకుండా మారాంచేసి తినిపిస్తాడు. ఈ వయసునుండే కష్టం, సుఖం తెలుసుకుని కుటుంబం గురించి ఎన్నో ఆలోచనలు చేస్తుంటాడు!

నా పిల్లల బంగారం లాంటి భవిష్యత్తు కోసం నా నగలు ఉపయోగపడుతున్నందుకు నాకు ఆనందమేకానీ బాధ ఎందుకమ్మా?"

అన్నపూర్ణమ్మ మాటలకావిడ నిట్టూర్చింది. అనుభవంతో చెబుతూన్న మాటలు కూతురి చెవికెక్కటంలేదనుకుంది.

అక్కడే వున్న కేశవ అమ్మమ్మతో అన్నాడు "అమ్మమ్మా, అందరు ఆడవాళ్ళలా మా అమ్మకి బంగారు నగలు అవసరంలేదు! మా అమ్మ మాట బంగారం... మనసు బంగారం... మనిషే బంగారం!"

అన్నపూర్ణలోని తల్లి మనసు పులకించిపోయింది! మురిపెంగా, ప్రేమగా కొడుకు తల నిమిరింది. అన్నపూర్ణమ్మ ధ్యాస, ధ్యేయం ఎప్పుడూ ఒక్కటే! కొడుకు బాగా చదువుకుని ప్రయోజకుడవ్వాలి! స్కూలులో ఎప్పుడూ ఫస్టున వుంటూ మాష్టర్లందరి ప్రశంసలనూ పొందే కొడుకుని చూసుకుని అన్నపూర్ణమ్మ గర్వంగా, ఆనందంగా కాలం గడిపేది.

ఆర్థిక ఇబ్బందులుగానీ, తన బంగారం అంతా అమ్మేయాల్సి వచ్చిన పరిస్థితులు గానీ ఆమెకి చికాకు కలిగించేవి కావు. 'మేడపైకి వెళ్ళాలనుకుంటున్నప్పుడు మెట్లు ఎక్కటం శ్రమ అనుకుంటే ఎలా? అని అనుకునేది.

తండ్రి తనకిస్తానన్న ఎకరం భూమితో పాటుగా నాలుగెకరాలనీ, ఎకరం యాభైవేల చొప్పున అన్నగారు అమ్మేశాడని అన్నపూర్ణమ్మకి బంధువుల ద్వారా తెలిసింది. ఇన్నాళ్ళు అలా వదిలేసినా చివరకు మంచి ధరే వచ్చిందనీ, కొడుకు చదువుకీ, కూతురి పెళ్ళికీ కొంత ఆసరా అవుతుందనీ అన్నపూర్ణమ్మ సంతోషించింది.

ఆ రోజే కేశవని తీసుకుని ఊరికి బయలుదేరింది. బస్సులో మూడు గంటల ప్రయాణం. అక్కడికి వెళ్ళేసరికి అన్నపూర్ణమ్మ అన్న మాధవరావు రెండో కూతురు పెళ్ళి చూపుల ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్నా, వదినా హడావుడిగా వున్నారు.

మాధవరావు ముక్తసరిగా మూడు నిముషాలు మాట్లాడాడు. తన సమస్యలు ఏకవురు పెట్టాడు. పెద్ద కూతురికి ఇచ్చినట్లే ఇవ్వాలనుకుంటే చిన్న కూతురికి సంబంధం కుదరలేదు. అందుకని ముప్పయివేలు ఎక్కువ ఇవ్వటానికి అంగీకరించవల్సి వచ్చింది. అది తెలిసి పెద్దల్లుడు, కూతురు తమకీ ఆ మొత్తం ఇవ్వాలని కబురు చేశారట. పెద్దల్లుడికి ఏం చెప్పుకోవాలా అని సతమతమవుతున్నాడట.

అన్నపూర్ణమ్మ తన భూమి సంగతి కదిపింది. "ఆ ఆరువేలకీ కొంచెం వేసి పదివేలూ తొందరలోనే పంపిస్తాలే" అన్నాడు మాధవరావు.

అన్నపూర్ణమ్మ ఒక క్షణం అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది! పదిహేడేళ్ళ క్రితం ఎకరం ఆరువేలకి అమ్మితే, ఇప్పుడు యాభైవేలకి అమ్మినా తనకి పదివేలు ఇస్తాడా?! అన్నగారు తెలివిగా మాట్లాడుతున్నానని అనుకుంటున్నాడా... లేక తనని అంత తెలివి తక్కువదానిలా జమకట్టాడా...?!

గొంతు పెగల్చుకుని మెల్లగా అంది. "ఆ ఎకరం నాకిస్తానని అన్నదేగదా?"

"రాసిచ్చారా?" రవ్వంత చిరాకుగా అన్నాడు మాధవరావు.

ఆ మాటకు అన్నపూర్ణమ్మ తుళ్ళిపడింది! కొరడా దెబ్బ తగిలినట్లుగా విలవిలలాడింది. అన్నగారిలో తనెరుగని కొత్తమనిషిని చూసింది. ఆమెకు అర్థమైపోయింది! అవునుమరి! ధనప్రలోభం మహాప్రవాహం! దానికి ఎదురొడ్డి ఎవరో మహామహులు నిలబడగలరుగానీ మామూలు మనుష్యులంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపోయేవాళ్ళేనని అనుకుంది మనసులో.

"రాసిచ్చినదానికంటే కొందరి నోటిమాటకే ఎక్కువ విలువ వుంటుంది. నా తల్లీ, తండ్రీ అలాంటివాళ్ళనే నేను రాసివ్వమని పట్టుబట్టలేదు" ఆవేశాన్ని అదుపులో పెట్టుకుని ఆ రెండు మాటలూ అని ఇక అక్కడ వుండకుండా కొడుకుని వెంటబెట్టుకుని వచ్చేసింది. అన్నగారు ఆ తర్వాత పదివేలూ పంపించినా తీసుకోకూడదని అనుకుంది. కానీ ఆ అవకాశం కూడా కలిగించలేదతను.

ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలు దాటుతోంది. తనతో పాటూ కొడుకూ భోజనం లేకుండా వున్నాడని హడావుడిగా వంట మొదలు పెట్టింది. ఇంతలో బయటనుండి వచ్చిన రాజేశ్వర్రావు కొడుకుని ఊరి విశేషాలు అడిగాడు వరండాలో కూర్చుని.

కేశవ నవ్వుతూ అన్నాడు. "నాన్నా, మామయ్య తన అల్లుడికి ఏం సమాధానం చెప్పుకోవాలా అనే సమస్యలో వున్నాడు. ఈ అల్లుడికి సమాధానం చెప్పటానికి మీ మామగారు లేరుగా! పరలోకం వెళ్ళిపోయారుగా!"

రాజేశ్వర్రావు పెద్దగా నవ్వాడు.

అన్నపూర్ణమ్మకి ఉక్రోషం ముంచుకొచ్చింది. బయటకు వచ్చి "అంత గొప్ప సంతోషం కలిగించే వార్త ఏముందనీ అలా పగలబడి నవ్వుకోవటం?" విసురుగా అంది.

"బావుంది. మధ్యలో నా మీద విరుచుకుపడుతున్నావేంటి? నవ్వటం కూడా తప్పేనా? మీ భవాని మొగుడిలా తెస్తావా, చస్తావా అని కూర్చోవాలా?" అన్నాడు రాజేశ్వర్రావు.

అన్నపూర్ణమ్మ నిర్ఘాంతపోయి నిలబడిపోయింది! ఆరేళ్ళ క్రితం చెరువులో పడి ప్రాణాలు తీసుకున్న పెద్దమ్మ కూతురు భవాని గుర్తుకొచ్చి కళ్ళు చెమ్మగిల్లాయ్!

భవానికి పెళ్ళిలో ఇస్తామన్న కట్నం తాలూకు పదివేలు పంటలు అందాక ఇస్తామని పుట్టింటి వాళ్ళు అన్నారు. భవానికి అత్తగారిల్లు చెరువుకిటూ, పుట్టిల్లుఅటూ. అయిదేళ్ళు గడిచినా ఏవో అవసరాలు గడుపుకుంటూ పుట్టింటివాళ్ళు అశ్రద్ధ చేస్తోంటే, అటు అత్తింటివాళ్ళు తీసుకురమ్మని గొడవచేసే వాళ్ళు.

'పెద్ద మనుష్యుల ముందు ఒప్పుకున్నాక ఇవ్వాలని తెలీదా! వాళ్ళ పనులు బాగానే జరుపుకుంటున్నారు. అంతమాట తప్పేవాళ్ళని అనుకోలేదు. వెళ్ళిపట్టుబట్టి తీసుకురా' అని భర్తా, అత్తమామలూ తరిమితే 'ఇవ్వక పారిపోయేవాళ్ళంకాదుగా, అంత పీకలమీద కూర్చుంటే ఎలా, ఆ మాత్రం గట్టిగా వాళ్ళకిచెప్పలేవూ, వెళ్ళిరా' అని పుట్టింటివాళ్ళు సాగనంపేవాళ్ళు.

ఆ చెరువు గట్టుమీద అటూ ఇటూ నలిగిన మనసుతో తిరిగి తిరిగీ అవమానంతో ఒక రోజు చెరువులోపడి ప్రాణాలు తీసుకుంది. అప్పుడు ఇలా జరుగుతుందనుకోలేదంటూ వాళ్ళూ వీళ్ళూ గుండెలు బాదుకుని ఏడ్చారు. కానీ బ్రతికుండగా అవమానంతో, వ్యధతో ఎంతగా ఆ పిల్ల మనసు నలిగిపోయిందో పట్టించుకోలేదు ఎవరూ!

భవాని జ్ఞాపకంతో దిగులుగా అలాగే నిలబడిపోయిన తల్లి దగ్గరకు వచ్చి కేశవ అన్నాడు "అమ్మా, మనకు వస్తుందనుకున్న డబ్బురానందుకు కష్టంగా వుందా?"

అన్నపూర్ణమ్మ తెప్పరిల్లి కొడుకు తల నిమురుతూ అంది. "నా మనసునెవరూ కష్టపెట్టలేరు. తెలుసా, ఒక్క నీకే ఆ శక్తివుంది!" కేశవ ఆశ్చర్యంగా చూస్తూ "అదేమిటమ్మా?" అన్నాడు.

"అవును. నువ్వు బాగా చదువుకుని గొప్పవాడివి కావాలి! ఆ కోరిక తీరకపోతే కష్టం కలుగుతుంది గానీ ఇలాంటి డబ్బు సమస్యలు నన్ను బాధపెట్టలేవు మరి!" అంది చిరునవ్వుతో.

"అయితే నీకు ఎప్పుడూ కష్టమనేదేకలగదు!" అన్నాడు ధీమాగా నవ్వుతూ. కేశవని ఆనందంగా చూసింది అన్నపూర్ణమ్మ. అన్నపూర్ణమ్మ కోరిక తీరింది. కొడుకు ప్రయోజకుడయ్యాడు. ఎమ్.బి.ఏ. పూర్తిచేశాడు. ఒక కంపెనీలో మానేజరుగా చేస్తున్నాడు. ఇద్దరికీ ఒక సంవత్సరంలోనే పెళ్ళిళ్ళు కూడా చేయగలిగింది.

కూతురికీ పెద్ద కట్నమివ్వకపోయినా మంచి సంబంధమే దొరికింది. రాజేశ్వర్రావు మరణంతో క్రుంగిపోయినా కొడుకు పిల్లలు మనవరాళ్ళిద్దరి ముద్దుముచ్చట్లతో సేద తీరుతూ కాలం గడుపుకువస్తోంది.

అన్నపూర్ణమ్మ వేరే వండుకు తినటం ప్రారంబించాక రెండేళ్ళు గడిచిపోయాయి. ఆ రోజు కొంచెం నలతగా వుంటే అన్నం తినకుండా మాగన్నుగా పడుకుంది.

మనవరాలు రూప వచ్చి "నాన్నమ్మా, లే, పెళ్ళికొడుకుని చూద్దువుగానీ, రా" అంటూ రానని అన్నా వినిపించుకోకుండా అన్నపూర్ణమ్మని లాక్కెళ్ళింది. మనవరాలి మాట తీసెయ్యలేక వెనకగది నుండి చూసి వచ్చేద్దామని వెళ్ళింది.

ఆ రోజు సరిత ఊళ్ళోనే వున్న పిన్ని కూతురికి తమ ఇంట్లో పెళ్ళిచూపులు ఏర్పాటు చేసింది. ఇరుగు పొరుగు బంధువులకి ముందుగానే తెలియటం ఇష్టంలేక సరిత పిన్ని ఇక్కడ పెట్టమంది.

అప్పుడే లోపలికి వచ్చిన పెళ్ళికొడుకు తల్లి అన్నపూర్ణమ్మని పలకరించి బంధుత్వాలు తిరగేస్తూ రెండు నిముషాలు మాట్లాడింది. పెళ్ళికొడుకుని చూసి తన గదిలోకి వచ్చి నీరసంగా పడుకుంది.

అంతా కాసేపటిలో వెళ్ళిపోయారు. వెళ్తూ సరితతో పిన్ని అంది. "పెళ్ళికొడుకు తల్లి మీ అత్తగారితో మాట్లాడుతూ, చేతులవేపు ఎలా పరీక్షగా చూసిందో గమనించావా? ఆవిడయినా అలా నల్లబడిపోయిన గిల్టుగాజులు వేసుకోవటం ఏమిటీ? మనకి చిన్నతనం కాదూ?"

సరితకి కోపం ముంచుకువచ్చింది అత్తగారిపై భర్త దగ్గర విరుచుకుపడింది.

"ఆవిడకి అంత తొందరెందుకూ కూతురికివ్వటానికి. ఎవరు కాజేస్తారని భయం! నల్లబడిన గిల్టుగాజులేసుకుని నలుగురిలో మన పరువు తీయాలని పంతంగానీ!"

కేశవరావుకి ఆ పనినచ్చలేదు. వెంటనే వెళ్ళి ఆ మాటే అడిగాడు తల్లిని. అన్నపూర్ణమ్మ వెర్రిదానిలా చూసింది కొడుకుని. 'మా అమ్మ మనిషే బంగారం' అన్న తన కేశవేనా?!

మనసులోని ఆక్రోశం ఉప్పెనలా బయటకు పొంగివస్తోంటే వడలిన ఆకులా వణికింది.

"చెల్లెలికి ఇచ్చానని ఎవరు అన్నార్రా?" ఆవేశంగా అన్నపూర్ణమ్మ అడిగింది.

"ఏం చేశావు మరి?"

"ఏం చేశానా...! మావల్లకాదని మీరంటే నరసమ్మకి వడ్డీతో ఇవ్వటానికి అమ్మాను" గాద్గదికంగా అంది. 'ఆ సంగతి చెప్పొచ్చుగా' అనుకుంటూ విద్దూరంగా చూసింది సరిత. కేశవరావూ అదే అడిగాడు.

ఎగసిపడుతోన్న గుండెలపై చేతితో రాసుకుంటూ ఒక క్షణం కొడుకువేపు సూటిగా, తీక్షణంగా చూసింది.

"ఎందుకు చెప్పలేదా? 'అబద్ధమాడరాదు' అంటూ నీకు నీతులు నేర్పించిన నేను నీకు అబద్ధం చెప్పలేదని సంజాయిషీ ఇచ్చుకోవటం అవమానంకాదూ?

అయినవాళ్ళతో వాదనెందుకని నాకు రావాల్సిన ఆస్తిని తేలిగ్గావదులుకోగలిగిన నేను ఈ కొంచెం డబ్బు కోసం అబద్ధం చెప్పగలనని ఎలా అనుకున్నావు?

చిన్నప్పటి నుండీ ఈ ఇంట్లో నీకు తెలియకుండా, చెప్పకుండా ఏదీ చెయ్యనని నీకు తెలిసినా, ఎక్కడో పుట్టి పెరిగిన కోడలు ఏదో అంటే నువ్వెలా నమ్మావు? సాక్ష్యం చూపించి నిజం నిరూపించుకోవడం నాకు అవమానం కాదూ...?"

తల్లి తీక్షణమైన చూపులోని ఆ ప్రశ్నలు వాడి బాణాలై గుండెకు గుచ్చుకోగా కేశవరావు తప్పు తెలుసుకుని విలవిలలాడిపోయాడు. "ఇంట్లో డబ్బువుంది. ఇప్పుడే నీకు ఇస్తాను. రేపే నేను నీ చేతులకు గాజులు చేయిస్తాను. పొరపాటు జరిగిందమ్మా" ఆవేశంగాలేచాడు. చెక్క బీరువాని లాగిపడేసి సరితతో అన్నాడు. "ఇది ఇక్కడ తీసిపడెయ్యి. ఈ ఇల్లు ఒక్కటిగానే వుండాలి!" కొడుకు మాటలకు అన్నపూర్ణమ్మ పెదవులపై చిరునవ్వు వెలిగింది. అవును! ఒక్కటిగానే వుంటుంది.

ప్రశాంతంగా నిదురపోతోన్న తల్లిని చూసి కేశవరావు కొయ్యబారిపోయాడు. చేతిలోని నోట్లు చెల్లాచెదురై అన్నపూర్ణమ్మ నిండా పరుచుకున్నాయి.

"అమ్మా... అమ్మా... నన్ను మన్నించవూ...!" అతని ఆక్రోశం ఆకాశం అంచులను తాకుతోంది.

స్వాతి మంత్లీ. 1989.